7

సాక్షి ఆదిలాబాద్

ఆదివారం । 6 । ఏప్రిల్ । 2025

శ్రీరామనవమికి సర్వం సిద్ధం

ఆదిలాబాద్: శ్రీరామనవమి ఉత్సవాలకు జిల్లాలోని ఆలయాలు ముస్తాబయ్యాయి. ఆదివారం ఆలయాల్లో సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నారు. జిల్లా కేంద్రంలోని హౌసింగ్ బోర్డు, తిరుపెల్లి కాలనీలోని శ్రీరామాలయం, శాంతినగర్ శ్రీకోదండ రామాలయం, విద్యానగర్ శ్రీదాసాంజనేయ స్వామి ఆలయాల్లో ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆలయాలను విద్యుద్దీపాలతో అలంకరించారు. శ్రీరామనవమి ఉత్సవ సమితి ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని శ్రీరామచంద్ర గోపాలకృష్ణ మఠం నుంచి ఆదివారం సాయంత్రం భారీ శోభాయాత్ర నిర్వహించనున్నారు. ఇస్కాన్ ఆదిలాబాద్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని మధుర జిన్నింగ్‌లో సీతారామచంద్రస్వామి కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించేందుకు ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేశారు.



విద్యుద్దీపాలతో వెలిగిపోతున్న తిరుపెల్లి శ్రీరామాలయం

న్యూస్‌రీల్

జగ్జీవన్‌రామ్ అడుగుజాడల్లో నడవాలి



నివాళులర్పిస్తున్న కలెక్టర్, అధికారులు

ఆదిలాబాద్‌రూరల్: ప్రతి ఒక్కరూ జగ్జీవన్‌రామ్ అడుగుజాడల్లో నడవాలని కలెక్టర్ రాజర్షిషా పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమశాఖ కార్యాలయ ఆవరణలోని, జగ్జీవన్‌రామ్ చౌక్‌లోని ఆయన విగ్రహం, చిత్రపటానికి కలెక్టర్‌తోపాటు ఎస్పీ అఖిల్ మహాజన్, అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. జగ్జీవన్‌రామ్ సేవలను కొనియాడారు. అనంతరం ఎస్టీయూ భవనంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. నేటితరం విద్యార్థులు జగ్జీవన్‌రామ్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. ఆర్డీవో వినోద్‌కుమార్, దళితాభివృద్ధి, కార్పొరేషన్ అధికారులు సునీతాకుమారి, మనోహర్, మున్సిపల్ కమిషనర్ సీవీఎన్.రాజు, డీఎస్పీ జీవన్‌రెడ్డి, దళిత సంఘాల నాయకులు మల్యాల భాస్కర్, సాయి, మనోజ్, మల్లేశ్, అల్లూరి భూమన్న, విద్యార్థులు పాల్గొన్నారు.

బాధ్యతగా వ్యవహరించాలి

- ఎస్పీ అఖిల్ మహాజన్
- దాబా హోటళ్ల యజమానులతో ప్రత్యేక సమావేశం



మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్ మహాజన్

గుడిహత్నూర్: జిల్లాలోని జాతీయ, అంతర్రాష్ట్ర రహదారుల వెంబడి ఉన్న దాబా హోటళ్ల యజమానులు సామాజిక బాధ్యతతో వ్యవహరించాలని ఎస్పీ అఖిల్ మహాజన్ సూచించారు. శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో జిల్లాలోని దాబా యజమానులతో సమావేశమై మాట్లాడారు. దాబాల్లో మద్యం, గంజాయి, అఫీం అమ్మడంతో పాటు అక్కడే సేవించడానికి అనుమతి ఇవ్వడం నేరమని పేర్కొన్నారు. దాబాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. పార్కింగ్ లేని దాబాలపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మేవాత్ దాబా అంటూ ఒకే పేరుతో నడుస్తున్న దాబాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని చెప్పారు. ఆయా దాబాల యజమానులు జాగ్రత్తగా ఉండాలని, నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. జిల్లాలో జాతీయ రహదారి వెంబడి ఎలాంటి అసాంఘిక చర్యలు జరిగినా దాబాలోని సీసీ ఫుటేజీల ఆధారంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గుర్తు తెలియని వ్యక్తులు ఆయుధాలతో వస్తే వెంటనే తమకు సమాచారం అందించాలని పేర్కొన్నారు. సమాచారం అందించిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. సమావేశంలో ఉట్నూర్ ఏఎస్పీ కాజల్, ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్‌రెడ్డి, డీసీఆర్‌బీ డీఎస్పీ నాగేందర్, సీఐలు, ఎస్సైలు తదితరులు పాల్గొన్నారు.



తుదిదశకు పిట్‌లైన్

ఆదిలాబాద్‌లో పిట్‌లైన్ పనులు తుదిదశకు చేరుకున్నాయి. రూ.17.90 కోట్ల అంచనా వ్యయంతో 24 కోచ్‌లతో దీని నిర్మాణం సాగుతోంది. దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని నాందేడ్ రైల్వే డివిజన్ పరిధిలోకి వచ్చే ఆదిలాబాద్ రైల్వేస్టేషన్ నుంచి రానున్న రోజుల్లో పలు రైళ్ల రాకపోకలకు ఈ పిట్‌లైన్ దోహదపడనుంది. ప్రధానంగా పిట్‌లైన్ ఏర్పాటుతో ఎక్స్‌ప్రెస్, ప్యాసింజర్ రైళ్ల కోచ్‌ల ప్రాథమిక నిర్వహణ ఇక్కడే జరగనుంది. పగలు, రాత్రి రైల్వే కోచ్‌ల తనిఖీలు, క్లీనింగ్, చార్జింగ్ చేస్తారు. దీని ఏర్పాటుతో పలు రైళ్ల గమ్యస్థానం ఆదిలాబాద్ నుంచే మొదలయ్యే ఆస్కారముంటుంది. ఇప్పటికే నాందేడ్ స్టేషన్‌కు వచ్చే రైళ్ల రద్దీ పెరిగిపోగా వాటిని ఇతర స్టేషన్లకు పొడిగించాలనే డిమాండ్ ఉంది. ఆదిలాబాద్‌కు ఆ రైళ్లను పొడిగించాలని ఏళ్లుగా పౌరసమాజ సభ్యులు డిమాండ్ చేస్తున్నారు.

చివరి దశలో ఐటీ టవర్

ఆదిలాబాద్‌లో ఐటీ టవర్ నిర్మాణం కూడా తుదిదశకు చేరింది. రాష్ట్ర ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ శాఖ (ఐటీఈ అండ్ సీ డిపార్ట్‌మెంట్) నుంచి మంజూరుతో ఈ టవర్ నిర్మాణమవుతోంది. ప్రస్తుతం ఆదిలాబాద్‌లో నివేదా, ఎన్‌టీటీ స్టార్టప్ కంపెనీలున్నాయి. దీంట్లో వందలాది మంది సాఫ్ట్‌వేర్ ఉద్యోగులున్నారు. ఒకవేళ ఐటీ టవర్ పూర్తయితే ఆదిలాబాద్‌కు అనేక స్టార్టప్ కంపెనీలు వచ్చేందుకు ఆస్కారముందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.



వ్యాపార అభివృద్ధికి దోహదం

ఆదిలాబాద్‌కు రవాణా సౌకర్యం మెరుగుపడుతుండగా ప్రస్తుతం అనేక బహుళజాతి కంపెనీల కిరాణా, వస్త్ర సంస్థలు ఇక్కడికి రానున్నాయి. ఇప్పటికే ఇండియన్ నేషనల్ మార్ట్ ఏర్పాటు కాగా, త్వరలో డీ మార్ట్‌ను మావలలో ఏర్పాటు చేయనున్నారు. ఇందుకు సంబంధించిన పనులు కూడా మొదలయ్యాయి. దస్నాపూర్‌లో జుడియో వస్త్ర, కాస్మొటిక్ సంస్థ భారీ మాల్‌ను ఏర్పాటు చేస్తోంది. ఇందుకు సంబంధించి పనులూ మొదలయ్యాయి. సౌత్ ఇండియా షాపింగ్ మాల్‌ను రవితేజ సమీపంలోని స్థలంలో ఏర్పాటు చేయనున్నారు. అంతే కాకుండా కిసాన్, సీఎంఆర్ షాపింగ్ మాల్స్ కూడా ఏర్పాటవుతున్నాయి.



అభివృద్ధి వైపు అడుగులు!

సండే స్పెషల్

- విమానాశ్రయం మంజూరుతో ఫోకస్
- వ్యాపారం, వాణిజ్యం, విద్యకు చాన్స్
- త్వరలో కార్పొరేట్ కంపెనీల ప్రవేశం
- తుది దశకు చేరిన పిట్‌లైన్ పనులు
- ఆదిలాబాద్ జిల్లాపై ప్రత్యేక దృష్టి



వెనుకబడిన జిల్లా అయిన ఆదిలాబాద్ రూపురేఖలు మారుతున్నాయి. ప్రధానంగా రవాణా రంగం విస్తరించడంతో ఇప్పుడు ఆదిలాబాద్‌పై కార్పొరేట్ సెక్టార్ల దృష్టి పడింది. దీంతో పాటు విద్యావకాశాలు మెరుగు పడేందుకు ఆస్కారమవుతుంది. రోడ్డు, రైలు మార్గాలు ఇప్పటివరకు ఉండగా , రానున్న రోజుల్లో విమానయానం కలగనుండటంతో ఇప్పుడు అందరి దృష్టి ఈ ప్రాంతంపై పడింది. దేశీయంగా, అంతర్జాతీయంగా కార్పొరేట్ కంపెనీలైన కిరాణం, ప్యాషన్, క్లాత్ కంపెనీలు ఆదిలాబాద్ బాట పడుతున్నాయి. భారీ స్థలాల్లో షాపింగ్ మాల్‌ల ఏర్పాటుకు ఇప్పటికే సన్నాహాలు మొదలయ్యాయి. –సాక్షి, ఆదిలాబాద్

విమానయానం

కేంద్రం ఆదిలాబాద్‌కు విమానాశ్రయాన్ని మంజూరు చేసిన విషయం తెలిసిందే. త్వరలో దీని ఏర్పాటుకు మార్గదర్శకాలు రానున్నాయి. విమానయానం మొదలైతే ఆదిలాబాద్‌పై ఫోకస్ భారీగా పెరగనుంది. ప్రధానంగా దేశంలోని బహుళజాతి కంపెనీలు ఈ ప్రాంతంపై దృష్టి సారించనున్నాయి. పత్తి ఆధారంగా ఆదిలాబాద్‌లో ఇప్పటికే జిన్నింగ్‌మిల్లులున్నాయి. రానున్న రోజుల్లో దీని ఆధారంగా ఇతర పరిశ్రమలు కూడా ఏర్పడేందుకు ఆస్కారముండనుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. పత్తి పరిశోధన కేంద్రం కూడా ఇప్పటికే మంజూరై ఉంది. రానున్న రోజుల్లో వైమానిక శిక్షణ కేంద్రం ఏర్పాటైతే దీనికి సంబంధించి అనేక మంది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు ఇక్కడ కొలువుదీరేందుకు ఆస్కారముంటుంది. వీరి కొనుగోళ్ల ద్వారా ఆదిలాబాద్ వ్యాపారం, వాణిజ్యపరంగా అభివృద్ధికి దోహదపడుతుందన్న అభిప్రాయం పలువురు వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా పలు విద్యాసంస్థలు ఈ ప్రాంతంలో ఏర్పాటయ్యేందుకు ఈ రవాణా రంగం ఉపయోగపడుతుందని చెబుతున్నారు.

విద్యాసంస్థలు ఏర్పడేనా?

జిల్లా కేంద్రంలో ఇప్పటికే రిమ్స్ వైద్యకళాశాల ఉంది. ఎంబీబీఎస్‌కు సంబంధించి 100 సీట్ల కెపాసిటీతో కొనసాగుతోంది. రిమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి కూడా మొదలైంది. దీని ఆధారంగా పీజీ సీట్లు మంజూ రయ్యాయి. ఆదిలాబాద్‌లో ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాల గత బీఆర్ఎస్ సర్కారు హయాంలో మంజూరైంది. దాని ఏర్పాటుకు మార్గదర్శకాలు రావాల్సి ఉంది. బీఎస్సీ అగ్రికల్చర్ కోర్సు ప్రస్తుతం కొనసాగుతోంది. కాగా, గతంలో సిమెంట్ కర్మాగారంతో ఇక్కడ కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు చేశారు. సిమెంట్ పరిశ్రమ మూతపడినప్పటికీ కేంద్రీయ విద్యాలయం కొనసాగుతోంది. వైమానిక శిక్షణ దళం ఏర్పాటు నేపథ్యంలో ఈ ప్రాంతంలో అనేక విద్యాలయాలు ఏర్పడేందుకు అవకాశాలున్నాయని పేర్కొన్నారు.

రవాణా విస్తరణతో అభివృద్ధి



ఆదిలాబాద్‌కు గతంలో సిమెంట్ పరిశ్రమ ఆధారంగా రైల్వేలైన్ వచ్చింది. ప్రస్తుతం ఎయిర్‌పోర్టుతో పాటు రానున్న రోజుల్లో ఎయిర్‌ఫోర్సు ఏర్పాటు కానుండటంతో ఈ ప్రాంతం అభివృద్ధి చెందనుంది. పత్తి ఆధారంగా పరిశ్రమలు, పరిశోధన కేంద్రం ఏర్పాటు కాగా రైతులకు ఉపయోగంగా ఉంది.– జగదీశ్ అగర్వాల్, సీఏ

కంపెనీలు వస్తున్నాయ్



ఆదిలాబాద్‌కు పలు వస్త్ర, కిరాణా సంబంధిత బహుళజాతి కంపెనీలు వస్తున్నాయి. భవిష్యత్‌లో మరిన్ని కంపెనీలూ ఆదిలాబాద్‌లో ఏర్పాటయ్యే అవకాశముంది. రవాణా మార్గాల అభివృద్ధితో వ్యాపార, వాణిజ్యంతో పాటు విద్య, వైద్య అవకాశాలు కూడా మెరుగయ్యే ఆస్కారముంటుంది.

– బచ్చు ప్రకాశ్, వ్యాపారవేత్త, ఆదిలాబాద్

స్టార్టప్ కంపెనీలు వస్తాయి



ఆదిలాబాద్‌లో ఇప్పటికే రెండు స్టార్టప్ కంపెనీలు పనిచేస్తున్నాయి. ఐటీ టవర్ నిర్మాణం కూడా పూర్తయితే మరికొన్ని స్టార్టప్ కంపెనీలను ఇక్కడ ఏర్పాటు చేసేందుకు ఆస్కారముంటుంది. వీటి ద్వారా ఈ ప్రాంతంలో సాఫ్ట్‌వేర్ రంగం అభివృద్ధికి అనేక అవకాశాలు ఏర్పడతాయి. సద్వినియోగం చేసుకోవాలి. – లంక కిరణ్, ఎన్‌టీటీ ఉద్యోగి

ఇంటిపన్ను @ 90.43%

- 243 పంచాయతీల్లో శతశాతం
- సమస్యల పరిష్కారానికి దోహదం

జిల్లాలో ఇంటి పన్ను వివరాలు
మొత్తం పంచాయతీలు : 473
పన్నుల డిమాండ్ : రూ.6,73,94,906
వసూలు చేసింది : రూ.6,09,48,138
శాతం : 90.43
ఇంకా మిగిలింది : రూ.66,46,768



తలమడుగు మండలం నందిగామలో పన్ను వసూలు చేస్తున్న కార్యదర్శి (ఫైల్)

కైలాస్‌నగర్: ఏడాది క్రితమే గ్రామపంచాయతీ పాలకవర్గాల పదవీకాలం ముగియగా నిధుల లేమితో గ్రామాలు కొట్టుమిట్టాడుతున్నాయి. అభివృద్ధి కుంటుపడింది. కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన 15వ ఆర్థికసంఘం నిధులు పూర్తిగా నిలిచిపోయాయి. రాష్ట్ర ప్రభుత్వం నుంచి అరకొరగానే అందుతున్నాయి. దీంతో పంచాయతీల్లోని సమస్యలు పరిష్కరించుకోవడం కార్యదర్శులకు తలకు మించిన భారంగా మారింది. ఈ నేపథ్యంలో ఆస్తిపన్ను వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించారు. ఆశించినస్థాయిలోనే వసూలు చేయగలిగారు. ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాల్లో తీరికలేకుండా ఉన్నప్పటికీ ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగి 90శాతం పన్ను వసూలు చేశారు. జిల్లాలో 473 గ్రామపంచాయతీలుండగా 243 పంచాయతీల్లో శతశాతం పన్ను వసూలు చేసి ఆదర్శంగా నిలిచారు. నిధుల లేమితో సతమతమవుతున్న పంచాయతీలకు ఇంటిపన్ను రూపంలో సమకూరిన ఆదాయం చిన్నపాటి సమస్యలు పరిష్కరించుకునేందుకు ఉపయోగపడనుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ఆదర్శంగా జైనథ్..

ఇంటిపన్ను వసూళ్లలో జైనథ్ మండలం ఆదర్శంగా నిలిచింది. ఈ మండలంలో 17 గ్రామపంచాయతీలుండగా 16 పంచాయతీలు వందశాతం పన్నులు వసూలు చేశాయి. పంచాయతీ సిబ్బంది సమన్వయంతో ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగిన కార్యదర్శులు లక్ష్యాన్ని సాధించి మిగతా పంచాయతీలకు ఆదర్శంగా నిలిచారు.

చిన్న సమస్యల పరిష్కారానికి..

పంచాయతీ ఖజానా ఖాళీగా ఉండటంతో పల్లె పాలన కార్యదర్శులకు పెనుభారంగా మారుతోంది. తాగునీరు, పారిశుధ్యం, విద్యుత్ తదితర కనీస మౌలిక వసతులు కల్పించాల్సిన బాధ్యత పంచాయతీలపై ఉంది. ఏడాదిగా పాలకవర్గాలు లేకపోవడం, ప్రత్యేకాధికారులు రాకపోవడంతో కార్యదర్శులే అన్ని వ్యవహారాలు చూసుకోవాల్సి వస్తోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు రాకపోవడంతో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం ఎండలు దంచికొడుతుండటం, భూగర్భజలాలు అడుగంటిపోవడంతో నీటి ఎద్దడి వారికి చాలెంజ్‌గా మారింది. ఇలాంటి పరిస్థితుల్లో ఇంటిపన్ను రూపంలో సమకూరిన ఆదాయంతో ఇలాంటి చిన్నపాటి సమస్యలు పరిష్కరించుకునేందుకు తోడ్పడిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

అట్టడుగున ఉట్నూర్..

అత్యధిక గ్రామపంచాయతీలు కలిగిన ఉట్నూర్ మండలం ఇంటిపన్ను వసూళ్లలో వెనుకబడి అట్టడుగుస్థానంలో ఉంది. ఈ మండలంలో 38 గ్రామపంచాయతీలుండగా 12 పంచాయతీలు మాత్రమే వందశాతం పన్నులు వసూలు చేశాయి. మరో 26 పంచాయతీలు పన్నుల వసూళ్లలో వెనుకబడ్డాయి. అదే ఏజెన్సీ ప్రాంతమైన నార్నూర్ మండలం కూడా భేష్ అనిపించుకుంది. ఈ మండలంలో 23 పంచాయతీలుండగా ఇందులో 20 పంచాయతీలు వందశాతం పన్నులు వసూలు చేశాయి. పక్కనే ఉన్న ఏజెన్సీ మండలమైన ఉట్నూర్ పూర్తిగా వెనుకబడిపోగా నార్నూర్ ఆశించిన స్థాయి కంటే అధికంగా వసూలు చేసి జిల్లాలో లక్ష్య సాధనలో రెండో స్థానంలో నిలవడం గమనార్హం. తలమడుగు మండల పరిస్థితి మరి అధ్వానంగా ఉంది. జిల్లా కేంద్రానికి ఆనుకుని ఉండే ఈ మండలం పన్నుల వసూలుపై అంతగా దృష్టి సారించలేదు. 29 పంచాయతీలకు ఏడు పంచాయతీలు మాత్రమే వందశాతం పన్నులు వసూలు చేయడం అక్కడి కార్యదర్శుల పనితీరుకు అద్దం పడుతోంది. 22 గ్రామపంచాయతీలు వెనుకబడిపోవడం గమనార్హం. మిగతా మండలాల్లోనూ ఇదే పరిస్థితి ఉంది.

మండలం	పంచాయతీలు	వందశాతం వసూలు చేసినవి
ఆదిలాబాద్	31	15
బజార్‌హత్నూర్	31	17
బేల	31	14
భీంపూర్	26	18
బోథ్	21	7
భోరజ్	17	9
గుడిహత్నూర్	26	19
ఇచ్చోడ	33	12
జైనథ్	17	16
మావల	3	1
నేరడిగొండ	32	11
సాత్నాల	17	11
సిరికొండ	18	7
సొనాల	12	3
తలమడుగు	29	7
తాంసి	14	8
గాదిగూడ	25	20
ఇంద్రవెల్లి	29	16
నార్నూర్	23	20
ఉట్నూర్	38	12



వేషధారణలో చిన్నారుల ప్రదర్శన

హరే రామ.. హరే కృష్ణ..

ఆదిలాబాద్: హరే రామ.. హరే కృష్ణ నామస్మరణతో శనివారం జిల్లా కేంద్రంలోని వీధులన్నీ మార్మోగాయి. భజన, కీర్తనలు, భక్తి గీతాలాపన, నృత్యాలతో పురవీధుల్లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఆదిలాబాద్ ఇస్కాన్ ఆధ్వర్యంలో శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా శనివారం పల్లకీ శోభాయాత్ర కన్నుల పండువగా సాగింది. సీతాలక్ష్మణ సమేతుడైన రాముడు పల్లకీ సేవలో భక్తులకు దర్శనమిచ్చాడు. దీంతో భక్తజనం పులకించిపోయింది.

మామిడిగూడ.. ఏదీ నీటి జాడ

- నెలరోజులుగా నిలిచిన 'భగీరథ'
- గ్రామాల్లో తీరని తాగునీటి వ్యథ
- వ్యవసాయ బావి నీరే ఆధారం
- నడవాల్సిందే కిలోమీటర్ల దూరం



రెండు కిలోమీటర్ల దూరంలోని వ్యవసాయ బావి



పంపుసెట్టు వద్ద నీటిని పట్టుకుంటున్న గ్రామస్తులు



బిందెలతో నీటిని తెచ్చుకుంటున్న మహిళలు



ఎడ్లబండ్లపై నీటిని తెచ్చుకుంటున్న ఆదివాసీలు

ఇంద్రవెల్లి: మండలంలోని మామిడిగూడ (జి), (బి) గ్రామాల ప్రజలు తాగునీటికి తండ్లాడుతున్నారు. ఇప్పటివరకు ఈ గ్రామాలకు మిషన్ భగీరథ నీరు సరఫరా లేదు. ప్రస్తుతం భూగర్భ జలాలు అడుగంటి గ్రామాల్లోని నీటి పథకాల ద్వారా నీటి సరఫరా నిలిచింది. తాగునీటి కోసం ఈ రెండు గ్రామాల ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. ఇప్పటివరకు గ్రామాలకు దూరంగా ఉన్న ఓ వ్యవసాయ బోరు నుంచి పైపులైన్ వేసి ట్యాంక్‌ను నీటితో నింపుకొనేవారు. ఈ నీటిని వినియోగించుకున్న వీరికి వేసవి శాపంగా మారింది. ప్రస్తుతం భూగర్భ జలాలు అడుగంటిపోయాయి. బోరు నుంచి చుక్క నీరు రావడం లేదు. ఈ గ్రామాల సమీపంలోని వ్యవసాయ బావుల్లోనూ నీరు అడుగంటింది. దీంతో చేసేది లేక రెండు కిలోమీటర్ల దూరంలోని పిట్టబొంగరం గ్రామానికి చెందిన ఉయిక గోవింద్ వ్యవసాయ బావినీటిని ఎడ్లబండ్లు, బిందెలతో తెచ్చుకుంటున్నారు. గ్రామంలో ఏర్పడిన నీటి సమస్య కారణంగా వ్యవసాయ పనులు మానేయాల్సి వచ్చిందని గ్రామాలకు చెందిన ఆదివాసీలు చెబుతున్నారు. ప్రతీ వేసవిలో సమస్య ఎదుర్కొంటున్న తాము ఏటా అధికారులు, ప్రజాప్రతినిధులకు గోడు వినిపించుకుంటున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి తమ నీటి కష్టాలు తీర్చాలని మామిడిగూడ(జి), మామిడిగూడ (బి) ప్రజలు వేడుకుంటున్నారు.

పట్టించుకుంటలేరు



నీటి సమస్య గురించి ఎవరికి తెలిపినా పట్టించుకుంటలేరు. ఎండాకాలం వస్తే చాలు తాగునీటికి తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నాం. జిల్లా అధికారులు వెంటనే దృష్టి సారించి గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్య పరిష్కరించాలి. ఇకముందు సమస్య లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. – సెడ్మాకి భీంరావ్

చాలా కష్టమవుతోంది



ప్రతీ సంవత్సరం వేసవి వస్తే చాలు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నాం. గ్రామ సమీపంలో ఎక్కడా నీటి సౌకర్యం లేదు. వ్యవసాయ పనులు మాని సుమారు రెండు కిలోమీటర్ల దూరంలోని వ్యవసాయ బావి నుంచి నీటిని తీసుకువచ్చి తాగుతున్నాం. చాలా కష్టమవుతోంది.

– సెడ్మాకి సీతాబాయి

ఇప్పటివరకు 'భగీరథ' రాలే..



మా గ్రామానికి ఇప్పటివరకు మిషన్ భగీరథ నీరు రాలేదు. గ్రామ సమీపంలోని వ్యవసాయ బావుల నీటిని తాగుతున్నాం. భూగర్భ జలాలు అడుగంటి బావులు, బోర్లలో చుక్క నీరు లేదు. గ్రామానికి రెండు కిలోమీటర్ల దూరంలోని వ్యవసాయ బావి నుంచి ఎడ్లబండ్లు, బిందెలతో నీటిని తెచ్చుకుంటున్నం.

– మెస్రం నాగోరావ్

క్లుప్తంగా

ఒకరిపై కేసు నమోదు

వేమనపల్లి: మండలంలోని మంగెనపల్లిలో శుక్రవారం పాలేరు నాయిని కన్నయ్య మృతికి కారణమైన యజమాని ఎనగంటి చిన్నన్నపై కేసు నమోదు చేసినట్లు నీల్వాయి ఎస్సై శ్యాంపటేల్ తెలిపారు. శనివారం చెన్నూర్ ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించారు.

పేకాడుతున్న తొమ్మిది మంది అరెస్టు

బెల్లంపల్లి: పట్టణంలోని అశోక్‌నగర్ బస్తీలో శనివారం పేకాటస్థావరంపై దాడిచేసి పేకాడుతున్న తొమ్మిది మందిని అరెస్టు చేసినట్లు వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో ఎన్.దేవయ్య తెలిపారు. బస్తీకి చెందిన ముక్కెర వెంకటేష్ ఇంటి వద్ద కొందరు పేకాడుతున్నట్లు వచ్చిన సమాచారం మేరకు దాడులు నిర్వహించిన బెల్లంపల్లికి చెందిన ముక్కెర వెంకటేష్, జంగం క్రాంతికుమార్, గొడుగు రమేశ్, తొగరి సురేష్, యాదగిరి మహేష్, బాకం సుమన్, గజ్జల స్వామి, ఎరుకల శ్రీనివాస్, సుందురీ మల్లాద్రిని అరెస్టు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. వారి వద్ద నుంచి 52 పేక ముక్కలు, రూ.12,550 నగదు, 7 ఫోన్లు, 5 బైక్‌లు స్వాధీనం చేసుకుని నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

గంజాయి స్వాధీనం



వివరాలు సేకరిస్తున్న ఎస్సై విజయ్

కెరమెరి: మండలంలోని ధనోరా గ్రామ సమీపంలో ఉన్న తుమ్మగూడలో శనివారం పుస్నక తుకారాం వద్ద నుంచి రూ.6,375 విలువ చేసే గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై గుంపుల విజయ్ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు తుకారం ఇంటి పెరట్లో తనిఖీలు నిర్వహించగా గంజాయి మూట కనిపించిందన్నారు. నిందితుడు తుకారాంపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

నిర్మల్: నర్సాపూర్ (జి) మండలంలోని చాక్‌పల్లి శివారులో 61వ జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల మేరకు... చాక్‌పల్లి గ్రామానికి చెందిన బ్యాగరి చిన్న భోజన్న ద్విచక్ర వాహనంపై వ్యవసాయ క్షేత్రానికి వెళ్తుండగా భైంసా నుంచి నిర్మల్ వైపు అతివేగంగా వెళ్తున్న కారు వెనుక నుండి ఢీకొట్టింది. ఘటనలో చిన్న భోజన్నకు తీవ్రగాయాలు కావడంతో గమనించిన స్థానికులు 108కు సమాచారం అందించారు. క్షతగాత్రున్ని నిర్మల్ ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

వేదపాఠశాల విద్యార్థి మృతిపై కేసు

బాసర: నిర్మల్ జిల్లా బాసరలోని వేద పాఠశాల విద్యార్థి మణికంఠ మృతిపై శనివారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై గణేశ్ తెలిపారు. మృతిపై అనుమానాలు ఉన్నాయని మృతుని తండ్రి హనుమకొండ జిల్లా శాయంపేటకు చెందిన బండారి రాజేందర్ ఫిర్యాదు చేశారు. వేద పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరారు.





సెలవు చావుకొచ్చింది!

- ఈతకు వెళ్లి ఇద్దరు విద్యార్థులు మృతి
- ఇద్దరినీ మింగిన చెరువు
- ఆదిలాబాద్ జిల్లాలో ఘటన
- రెండు కుటుంబాల్లో విషాదం



సంజీవ్ (ఫైల్)



రాహుల్ (ఫైల్)



విలపిస్తున్న రాహుల్ కుటుంబ సభ్యులు

ఆదిలాబాద్‌రూరల్: సెలవు ఆ విద్యార్థుల చావుకొచ్చింది. ఈత సరదా ఇద్దరు చిన్నారుల ప్రాణాలు బలిగొంది. ఆదిలాబాద్ జిల్లా మావల మండలంలో జరిగిన సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. ఏపీలోని వైజాగ్‌కు చెందిన కాంబ్లే దుర్గాప్రసాద్, సత్యభామ దంపతులు ఐదేళ్ల క్రితం ఉపాధి నిమిత్తం ఆదిలాబాద్‌కు వచ్చారు. మావల మండల కేంద్రంలోని 170 కాలనీలో గుడిసెలు వేసుకుని నివాసం ఉంటున్నారు. వారికి రాహుల్ (9) (నాలుగో తరగతి), విశాల్ ఇద్దరు కుమారులు. ఇద్దర్నీ మావల మండల కేంద్రంలోని ఎంపీపీఎస్2లో చదివిస్తున్నారు. శనివారం పాఠశాలకు సెలవు ఉండడంతో రాహుల్, విశాల్, స్నేహితుడు చిప్పకుర్తి సంజీవ్ (10)తో కలిసి ఈత కొట్టేందుకు మండల కేంద్రంలోని జాతీయ రహదారి 44కు ఆనుకుని ఉన్న ఎర్రకుంట చెరువు వద్దకు వెళ్లారు. రాహుల్, సంజీవ్ స్నానం చేసేందుకు చెరువులోకి దిగారు. విశాల్ చెరువు చుట్టుపక్కల ఆడుకుంటూ ఉన్నాడు. కొంత సేపటికి రాహుల్, సంజీవ్ నీటిలో మునిగిపోవడంతో గమనించిన విశాల్ విషయాన్ని స్థానికులతో పాటు కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. మావల పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని గజ ఈతగాళ్ల సాయంతో మృతదేహాలను వెలికితీయించారు. పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్రంలోని రిమ్స్ మార్చురీకి తరలించారు.

రెండు రోజుల్లో పుట్టిన రోజు..

గుడిహత్నూర్ మండల కేంద్రానికి చెందిన చిప్పకుర్తి రాజ్‌కుమార్ కుమారుడు సంజీవ్ నానమ్మ తారాబాయి వద్ద ఉండి మావల పాఠశాలలో ఐదోతరగతి చదువుతున్నాడు. మరో రెండు రోజుల్లో అతని పుట్టినరోజు ఉంది. ఇందుకోసం తారాబాయి తన పింఛన్ డబ్బులతో కొత్త బట్టలు కొనిచ్చేందుకు తీసుకెళ్దామని అనుకుంది. అంతలోనే స్నేహితులు రావడంతో వారితో కలిసి ఆడుకునేందుకు బయటకు వెళ్లాడు. కొద్దిసేపటికే ఈ విషాదకర వార్త తెలియడంతో తారాబాయి అక్కడికి చేరుకుని నా కోరిక తీరక ముందే వెళ్లిపోయావా.. అంటూ గుండెలు బాదుకుంటూ విలపించిన తీరు పలువురిని కంటతడి పెట్టించింది. ఇరువురి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు.

వాలీబాల్ పోటీల విజేత హైదరాబాద్



రన్నరప్‌గా నిలిచిన బెల్లంపల్లి జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న జీఎం విజయ భాస్కర్‌రెడ్డి

రెబ్బెన(ఆసిఫాబాద్): గోలేటి టౌన్‌షిప్‌లోని భీమన్న స్టేడియంలో సింగరేణి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 36వ వేణుగోపాల్ మెమోరియల్ ఇన్విటేషనల్ వాలీబాల్ పోటీలు శనివారంతో ముగిశాయి. హైదరాబాద్ జట్టు విజేతగా బెల్లంపల్లి జట్టు రన్నరప్‌గా నిలిచాయి. నాకౌట్ కం లీగ్ పద్ధతిలో నిర్వహించిన సెమీ ఫైనల్, ఫైనల్ పోటీల్లో ఇరు జట్లు హోరాహోరీగా తలపడ్డాయి. హైదరాబాద్ జట్టు అద్భుత ఆటతీరును ప్రదర్శించి విజయ కేతనం ఎగురవేసింది.

సింగరేణిలో క్రీడలకు పెద్దపీట

సింగరేణి యాజమాన్యం క్రీడలకు పెద్దపీట వేస్తోందని బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ విజయ భాస్కర్‌రెడ్డి అన్నారు. శనివారం భీమన్న స్టేడియంలో నిర్వహించిన వాలీబాల్ పోటీల్లో విజేతలకు బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణిలో పని చేసిన ఓ ఉద్యోగి పేరుతో 36 సంవత్సరాలుగా రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. క్రీడాకారుల్లో క్రమశిక్షణ, క్రీడాస్ఫూర్తి ఎంతో అవసరమన్నారు. పోటీల్లో గెలుపు ఓటములు సర్వసాధారణమని, ఓటమిని కారణాలను విశ్లేషించుకుంటూ గెలుపు దిశగా క్రీడాకారులు పయనించాలన్నారు. అనంతరం విజేతగా నిలిచిన హైదరాబాద్ జట్టుకు ట్రోఫీతో పాటు రూ.30 వేల నగదు, రన్నరప్‌గా నిలిచిన బెల్లంపల్లి జట్టుకు ట్రోఫీతో పాటు రూ. 20 వేల నగదు బహుమతి అందజేశారు. ఈ కార్యక్రమాల్లో ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి ఎస్.తిరుపతి, డీజీఎం ఐఈడీ ఉజ్వల్‌కుమార్ బెహెరా, పర్సనల్ మేనేజర్ రెడ్డి మల్ల తిరుపతి, సీనియర్ పర్సనల్ అధికారులు శ్రీనివాస్, ప్రశాంత్, ఆర్జీ-2 ఏరియా స్పోర్ట్స్ సూపర్‌వైజర్ నరేందర్‌రెడ్డి, బెల్లంపల్లి రీజియన్ స్పోర్ట్స్ సూపర్‌వైజర్ అశోక్, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ కిరణ్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

బాసరలో విద్యుత్ దీపాల ఏర్పాటు



సాక్షి ఎఫెక్ట్..

'భక్తుల భద్రత గాలిలో దీపమే' శీర్షికన 'సాక్షి'లో శనివారం ప్రచురితమైన కథనానికి బాసర గ్రామ పంచాయతీ ఈవో ప్రసాద్‌గౌడ్ స్పందించారు. బాసర ఆలయంతో పాటు ప్రధాన కూడళ్లు, రైల్వే స్టేషన్, గోదావరి నది స్నాన ఘట్టాలు, తదితర ప్రాంతాల్లో 'సాక్షి' పరిశీలన చేపట్టింది. రాత్రి సమయంలో చీకట్లో ఉన్న పరిస్థితులను కథనంలో ప్రచురించింది. స్పందించిన అధికారులు రైల్వే స్టేషన్, బస్టాండ్, ప్రధాన రోడ్ల వద్ద వీధి దీపాలు ఏర్పాటు చేశారు. – భైంసా/బాసర



రైల్వేస్టేషన్ వద్ద విద్యుత్ దీపాలు

కళాకారులకు ఉపాధి కల్పిస్తాం

- టీవీ ఫెడరేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేశ్



మాట్లాడుతున్న నాగబాల సురేశ్

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలోని కళాకారులకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా ముందుకెళ్తున్నామని తెలంగాణ టీవీ ఫెడరేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు నాగబాల సురేశ్‌కుమార్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని పిక్చర్ టైం థియేటర్‌లో ఔత్సాహిక కళాకారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో యువ దర్శకుడు దండనాయకుల మానస్‌తో కలిసి మాట్లాడారు. జిల్లాలో అనేక ప్రకృతి వనరులు ఉన్నాయని, వీటిని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకుంటే సినిమా, సీరియల్స్ షూటింగ్‌లకు ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. ఇప్పటి వరకు 27 సీరియల్స్, 927 డాక్యుమెంటరీలు నిర్మించినట్లు తెలిపారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి 110 మందిని బుల్లితెరకు పరిచయం చేసినట్లు తెలిపారు. రానున్న రోజుల్లో మరింత మందికి అవకాశం కల్పిస్తామన్నారు. షూటింగ్ కోసం జిల్లాకు వచ్చే కళాకారులకోసం ప్రత్యేక స్టూడియోలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఇదే విషయాన్ని సీఎంతో పాటు, సినిమా ఇండస్ట్రీ చైర్మన్ దిల్‌రాజు దృష్టికి తీసుకెళ్లానన్నారు. సమావేశంలో నవజ్యోతి సాంస్కృతిక సారథి అధ్యక్షుడు ధర్మపురి వెంకటేశ్వర్లు, సభ్యులు రాధాకృష్ణాచారి, జిల్లాలోని కళాకారులు పాల్గొన్నారు.

పీఏసీఎస్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా రాజన్న



కావటి రాజన్న

జన్నారం: పీఏసీఎస్ ఉద్యోగుల సంఘం మంచిర్యాల జిల్లా అధ్యక్షుడిగా జన్నారం మండలంలోని పొనకల్ పీఏసీఎస్ కార్యదర్శి కావటి రాజన్న శనివారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంచిర్యాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా మచ్చా మధుకర్, ప్రధాన కార్యదర్శిగా విష్ణువర్ధన్‌రావు, సలహాదారులుగా రాజిరెడ్డి, లక్ష్మారెడ్డి, సత్యనారాయణను ఎన్నుకున్నట్లు ఆయన పేర్కొన్నారు.

కూరగాయలు అమ్మేందుకు వచ్చి మృత్యుఒడిలోకి..

- విద్యుత్‌షాక్‌తో యువరైతు మృతి



పొచ్చన్న (ఫైల్)

తాంసి: కూరగాయలు విక్రయించేందుకు వచ్చి విద్యుత్ షాక్‌తో యువరైతు మృతి చెందిన సంఘటన జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం తాంసి మండలంలోని పొన్నారి గ్రామానికి చెందిన అశిలీ పొచ్చన్న (38) తనకున్న ఎకరంతో పాటు మరో నాలుగెకరాలు కౌలుకు తీసుకుని 20 ఏళ్లుగా కూరగాయలు సాగు చేస్తున్నాడు. వాటిని జిల్లా కేంద్రంలోని రైతు బజార్‌కు తీసుకెళ్లి విక్రయిస్తుంటాడు. శుక్రవారం సాయంత్రం కూరగాయలు విక్రయించడానికి జిల్లా కేంద్రంలోని రైతు బజార్‌కు వచ్చాడు. విక్రయించిన అనంతరం రాత్రి సమయంలో విద్యుత్‌బల్బును తొలగించే క్రమంలో షాక్ కొట్టడంతో పక్కనున్న రాళ్లపై పడి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. గమనించిన స్థానికులు ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుని భార్య మమత ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై సునీల్ తెలిపారు.

ట్రాక్టర్ ఢీకొని యువకుడు మృతి

వాంకిడి: ట్రాక్టర్ ఢీకొని యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఏఎస్సై పోశెట్టి తెలిపిన వివరాల మేరకు సిర్పూర్(టి) మండలంలోని మేడ్‌పెల్లి గ్రామానికి చెందిన మడావి రాజ్‌కుమార్ (22) శుక్రవారం వాంకిడి మండలంలోని బండకాస గ్రామంలో ఉన్న బంధువుల ఇంట్లో పెళ్లికి వచ్చాడు. పని నిమిత్తం ద్విచక్ర వాహనంపై వాంకిడికి వచ్చి వెళ్తుండగా నవేధరి గ్రామ సమీపంలో ఎదురుగా వచ్చిన ట్రాక్టర్ ఢీకొట్టింది. తీవ్రగాయాలు కావడంతో రాజ్‌కుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆసిఫాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుని తండ్రి శంకర్ ఫిర్యాదు మేరకు ట్రాక్టర్ డ్రైవర్ కుమ్రె విజయ్‌పై కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై తెలిపారు.

అర్ధరాత్రి వరకు ఆందోళన

బాధిత కుటుంబానికి నష్ట పరిహారం చెల్లించాలని మృతుని బంధువులు, ఆదివాసీ సంఘాల నాయకులు మృతదేహంతో రహదారిపై ఆందోళన చేపట్టారు. దహన సంస్కారాలకు రూ. 50 వేలు, పరిహారం కింద రూ.3 లక్షలు ఇచ్చేందుకు ట్రాక్టర్ యాజమాని ఒప్పుకోవడంతో ఆందోళన విరమించారు.

రోడ్డు ప్రమాదంలో రాజస్థాన్ వాసి...

నేరడిగొండ: మండలంలోని కుప్టి జాతీయ రహదారిపై శనివారం తెల్లవారుజామున గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరు మృతి చెందినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. రాజస్థాన్‌కు చెందిన దిలీప్ గుజర్ (20) కుప్టి వద్ద గల ధాబా హోటల్‌లో పనిచేస్తున్నాడు. హోటల్ యజమాని పని నిమిత్తం రాజస్థాన్‌కు వెళ్తున్న క్రమంలో అతన్ని బస్సు ఎక్కించి హోటల్‌కు వెళ్తుండగా రోడ్డు దాటుతున్న సమయంలో గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని బోథ్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం



సరస్వతీ కాలువలో గుర్తు తెలియని మృతదేహం

లక్ష్మణచాంద: మండలంలోని రాచాపూర్ శివారులోని సరస్వతి కాలువలో శనివారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని బయటకు తీసి నిర్మల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుని వయస్సు 45 నుంచి 50 సంవత్సరాల మధ్య ఉంటుందన్నారు. రాచాపూర్ కారోబార్ రాజేందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఏఎస్సై శ్రీనివాస్ వర్మ, ప్రొబేషనరీ ఎస్సై జుబేర్ తెలిపారు.

సిర్పూర్(టి): మండలంలోని టోంకిని గ్రామ సమీపంలో పెన్‌గంగ నదిలో శనివారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై కమలాకర్ తెలిపారు. స్థానికులు అందించిన సమాచారం మేరకు సంఘటన స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ సామాజిక ఆస్పత్రికి తరలించినట్లు ఆయన పేర్కొన్నారు. మృతునికి సుమారు 50 ఏళ్లు ఉంటాయన్నారు.

హీరాసుకా జెండా తొలగింపుపై చర్చావేదిక

- తరలివచ్చిన ఉమ్మడి జిల్లా ఆదివాసీలు



చర్చావేదికలో పాల్గొన్న ఉమ్మడి జిల్లా ఆదివాసీలు

ఇంద్రవెల్లి: మండలంలోని కేస్లాపూర్ నాగోబా ఆలయ సమీపంలో ఏర్పాటు చేసిన పర్ధాన్ సమాజ్ కుల గురువు హీరాసుకా స్మారక జెండాను ఇటీవల గుర్తు తెలియని దుండగులు తొలగించారు. దీనిపై శనివారం కేస్లాపూర్ నాగోబా దర్బార్ హాల్‌లో నాగోబా ఆలయ పీఠాధిపతి మెస్రం వెంకట్‌రావ్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాలోని నాలుగు సగల ఆదివాసీలతో చర్చావేదిక నిర్వహించారు. నాగోబా ప్రాంగణంలో హీరాసుక జెండాను ఏర్పాటు చేయడం సరికాదని, వేరేస్థలంలో ఏర్పాటు చేయాలని తీర్మానించారు. ఆదిలాబాద్ ఎస్పీ అఖిల్ మహాజన్, ఉట్నూర్ ఏఎస్పీ కాజల్‌సింగ్ ఇంద్రవెల్లి పోలీస్ స్టేషన్‌ను సందర్శించి కేస్లాపూర్ నాగోబా దర్బార్ హాల్‌లో కొనసాగుతున్న ఆదివాసీల చర్చావేదికను ఉట్నూర్ సీఐ మొగిలి, ఎస్సై దుబ్బాక సునీల్ ద్వారా తెలుసుకున్నారు.

నూతన గనులు ఏర్పాటు చేయాలి



డైరెక్టర్‌ను సత్కరిస్తున్న ఐఎన్టీయూసీ నేతలు

శ్రీరాంపూర్: సింగరేణిలో నూతన గనులను ఏర్పాటు చేయాలని ఐఎన్టీయూసీ నేతలు శనివారం కంపెనీ డైరెక్టర్‌ను కోరారు. ఆర్జీవన్ ఏరియాలో పర్యటన నిమిత్తం వచ్చిన సింగరేణి డైరెక్టర్(పా) కొప్పుల వెంకటేశ్వర్లును ఐఎన్టీయూసీ సెక్రటరీ జనరల్, రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి చైర్మన్ బీ.జనక్‌ప్రసాద్ కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంపెనీలో సుదీర్ఘకాలం ఒకేస్థానంలో పనిచేస్తున్న అధికారులను బదిలీ చేయాలన్నారు. ప్రస్తుతం పదేళ్లు దాటిన వారిని బదిలీ చేయాలని నిర్ణయం తీసుకున్నారని, దీన్ని ఐదేళ్లకు కుదించాలన్నారు. వేసవి తీవ్రత దృష్ట్యా ఉద్యోగుల రక్షణ, సంక్షేమంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. అధికారుల పనితీరును అంచనా వేసే విధంగా పర్ఫార్మెన్స్ ఇండికేటర్ విధానాన్ని అమల్లోకి తీసుకురావాలన్నారు. అనంతరం డైరెక్టర్‌ను సత్కరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ కేంద్ర సీనియర్ ఉపాధ్యక్షులు నరసింహారెడ్డి, ధర్మపురి, కాంపల్లి సమ్మయ్య, ప్రధాన కార్యదర్శి లక్ష్మీపతిగౌడ్, ఆర్జీ 1 ఏరియా ఉపాధ్యక్షులు సదానందం, నాయకులు వడ్డేపల్లి దాస్, గడ్డం కృష్ణ, లింగమూర్తి, సాయి, సూర్యనారాయణ పాల్గొన్నారు.

బీజేపీ, కాంగ్రెస్ నాయకుల మధ్య వాగ్వాదం



మోదీ చిత్ర పటానికి క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు



ఘర్షణకు దిగుతున్న బీజేపీ, కాంగ్రెస్ నాయకులు

చెన్నూర్‌రూరల్: మండలంలోని కిష్టంపేటలో శనివారం రేషన్ బియ్యం పంపిణీ కార్యక్రమంలో బీజేపీ, కాంగ్రెస్ నాయకుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. కేంద్రం నిధులతోనే సన్నబియ్యం పంపిణీ చేస్తున్నారని, అందుకు ప్రతీ రేషన్ షాపు వద్ద బీజేపీ నాయకులు ప్రధాని నరేంద్ర మోదీ చిత్రపటం ఏర్పాటు చేసి క్షీరాభిషేకం చేస్తున్నారు. ఈ క్రమంలో కాంగ్రెస్ నాయకులు మోదీ ఫ్లెక్సీని తొలగించడంతో ఇరుపార్టీల నాయకుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ఇరుపార్టీల నాయకులను శాంతింపజేశారు.

సింగరేణి విద్యాసంస్థల్లో నాణ్యమైన బోధన



మాట్లాడుతున్న జీఎం శ్రీనివాస్

శ్రీరాంపూర్: సింగరేణి విద్యాసంస్థల్లో నాణ్యమైన బోధన చేస్తున్నామని శ్రీరాంపూర్ ఏరియా జీఎం ఎం.శ్రీనివాస్ పేర్కొన్నారు. శనివారం సీసీసీలోని సింగరేణి హైస్కూల్‌లో పదోతరగతి పరీక్ష రాసిన విద్యార్థులకు గ్రాడ్యుయేషన్, కెరీర్ గైడెన్స్ ప్రోగ్రాం నిర్వహించారు. పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి జీఎం ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం శిక్షణ పొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లను అందించారు. ఈ కార్యక్రమంలో డీజీఎం (పర్సనల్) అరవిందరావు, పాఠశాల కరస్పాండెంట్ ఏ.రాజేశ్వర్, ప్రధానోపాధ్యాయులు సంతోష్, రిటైర్డ్ డైట్ కళాశాల ప్రిన్సిపాల్ ఇంద్రప్రకాష్‌రెడ్డి, పూర్వ విద్యార్థుల సంఘం సభ్యులు సమ్మయ్య, వాణిశ్రీ, రాజారెడ్డి, శ్యాంసుందర్‌రెడ్డి, కృష్ణవేణి, తదితరులు పాల్గొన్నారు.